ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక


సంపుటి - 03 సంచిక -137 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 24 జూన్ 2026

# కులం పేరుతో వైకాపా కుట్రలు

**వైకాపా కుల,కుట్ర రాజకీయాలు తిప్ప కొట్టాలి**

**ప్రతి అంశంపైనా అవగాహన పెంచుకోవాలి**

**మంత్రులకు చంద్రబాబు సూచన**




**అమరావతి,జూన్, 23ఆంధ్ర ప్రగతి**కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్స్‌ను వైసీపీ వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన సీఎం, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసీపీ మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు**మిగతా 2లో...**







# ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

**పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి**

**పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్**

**కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు**

**న్యూఢిల్లీ,జూన్, 23ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు**మిగతా 2లో...**



# పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంపు

**ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం**

**80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్**

**వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట**

**పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం**

**రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన**

**ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన**

**జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం**

**అమరావతి,జూన్, 23ఆంధ్ర ప్రగతి**

ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ. 34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా **మిగతా 2లో...**



# కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

**గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి**




**న్యూఢిల్లీ,జూన్, 23ఆంధ్ర ప్రగతి**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున**మిగతా 2లో...**

# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

**ప్రభుత్వం జీవో విడుదల..**

**చేతల ప్రభుత్వం అన్న లోకేశ్**



2లో.

# రాయలసీమలో 'పసిడి' పంట.

## .స్వర్ణగిరిగా... ఇక జొన్నగిరి.

**-రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ పెట్టుబడి.**

**-ఏడాదికి 400 కేజీలు, 900 కేజీలు, 2 టన్నులు-దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత.**

**-ఉత్పత్తి అయిన బంగారం విలువలో రాష్ట్ర ఖజానాకు 4 శాతం రాయల్టీ.**

**-గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు.**

**-విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన.**



**ఆంధ్ర ప్రగతి అమరావతి/కర్నూలు , జూన్, 23** బంగారు నిక్షేపాల గని అంటే కర్నాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది... కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి. దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించున్నారు. **మిగతా 2లో...**



# విశాఖ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

**: విశాఖ పరిశ్రమలపై పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు**

**విశాఖ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం, ఇద్దరు కార్మికుల మృతి**

**పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని పవన్ ఆదేశం**

**మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**

**విశాఖపట్నంజూన్, 23ఆంధ్ర ప్రగతి**

విశాఖపట్నం సమీపంలోని అనకాపల్లి జిల్లా, పరవాడ ఫార్మా సిటీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, విశాఖ పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని పరిశ్రమల్లో తక్షణమే భద్రతా తనిఖీలు (సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని**మిగతా 2లో...**

# మెట్రో ఆస్తులపై సీఎం కన్ను

**కాంగ్రెస్ అవినీతి పై పోరాటం చేస్తాం**

**హైదరాబాద్ మెట్రో ట్రైన్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు : కేటీఆర్**

**మియాపూర్‌జూన్, 23ఆంధ్ర ప్రగతి**

కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పార్టీ నియోజవకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం **మిగతా 2లో...**



# గాదె సాయికృష్ణ కేసులో ... కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

**విజయవాడలో యువకుడు సాయికృష్ణ అదృశ్యంపై విచారణ**

**సీఐ అరెస్టును అడ్డుకునేందుకు మద్దతుదారుల ప్రయత్నం**

**అమరావతి,జూన్, 23ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ (25) అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు**మిగతా 2లో...**



## కులం పేరుతో వైకాపా కుట్రలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సీఎం కీలక ప్రకటనలు చేశారు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జూలై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. కులాల మధ్య చిచ్చుపెట్టే ఆ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని మంత్రులకు ఆయన సూచించారు. మంత్రులు అన్ని శాఖలపైనా అవగాహన పెంచుకోవాలి. తన శాఖ పరిధి కాదని కూర్చోకుండా ప్రతి అంశంపై స్పందించాలి. డీఎస్సీ, వివిధ అంశాలపై వైకాపా చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ వ్యవహారంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని అతడి కుటుంబసభ్యులు నమ్మారని మంత్రులు అన్నారు. ఈ అంశంలో వైకాపా రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

## వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

### ప్రభుత్వం జీవో విడుదల..ఐచేతల ప్రభుత్వం అన్న లోకేశ్



**అమరావతి,జూన్, 23ఆంధ్ర ప్రగతి**

వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వడ్డెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వడ్డెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గాదె సాయికృష్ణ కేసులో ... కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

**మొదటి పేజీ తరువాయి**

బృందం (సిట్), సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్‌వీవీ నాగరాజును అదుపులోకి తీసుకుంది.గత మే 9న కృష్ణలంక పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత అతను కనిపించకుండా పోయాడని బాధితుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించారు. పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేసి చంపేసి, మృతదేహాన్ని మాయం చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, సీఐ నాగరాజును సస్పెండ్ చేయడంతో పాటు సమగ్ర విచారణ కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది.ఈ క్రమంలో, సీఐ నాగరాజుపై హత్య, అక్రమ నిర్బంధం వంటి అభియోగాలతో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం సిట్ అధికారులు విజయవాడ సింగ్ నగర్‌లోని నాగరాజు నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.
భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, నాగరాజును విచారణ నిమిత్తం సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడ సుమారు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన అనంతరం ఆయనను అరెస్టు చేశారు. నాగరాజు అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని సిట్ అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

**మొదటి పేజీ తరువాయి**

విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు.అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## విశాఖ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

**మొదటి పేజీ తరువాయి**

అధికారులను ఆదేశించారు.పరవాడ మండలం, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని 'దక్షినా ఎనర్జీ' కెమికల్ ఫ్యాక్టరీలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో ఇద్దరు కార్మికులు లోపలే చిక్కుకుని సజీవదహనమయ్యారు. మరో ఇద్దరు గాయపడగా, వారిని మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటన గురించి తెలియగానే పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## మెట్రో ఆస్తులపై సీఎం కన్ను

**మొదటి పేజీ తరువాయి**

మియాపూర్‌లోని నేరన్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైల్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై రేవంత్ రెడ్డి కన్ను పడిందన్నారు. బీఆర్ఎస్ తరఫున కార్యకర్తల కష్టంతో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి మారారని ఆరోపించారు. ఆయననే గతంలో పదేండ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క శేరిలింగంపల్లి నియోజకవర్గానికి రూ.9,500 కోట్లతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో ఒక ప్రగతి నివేదికను విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు.మరి ఈ రెండేండ్లలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి గద్దెనెక్కాడని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు రూ.2500 ఇవన్నీ ఎక్కడా అని ప్రశ్నించారు. కేసీఆర్ మళ్ళీ ఎప్పుడు అధికారంలోకి వస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో అరచకాలు సృష్టిస్తోందన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేక్, జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, సీనియర్ నాయకులు

## పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంపు

**మొదటి పేజీ తరువాయి**

35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళు ,, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఎ÷-లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## రాయలసీమలో 'పసిడి' పంట.

**మొదటి పేజీ తరువాయి**



ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు. ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది ఉత్పత్తి పెరుగుతూ... ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు. ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది. మొదట తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వరకూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

**ప్రారంభోత్సవం. శంకుస్థాపన**

కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్‌తో 0.021 టీఎంసీలను వినియోగించనున్నారు. ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి... అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.

## ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

**మొదటి పేజీ తరువాయి**

ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

## 60 ఏళ్ల ప్రయాణంలో శివసేన అంతర్ధాన దశ

### ఉద్ధవ్ స్వయంకృతంతో పార్టీకి ముప్పు -తండ్రి ఆశయాలు కాపాడడంలో పూర్తిగా విఫలం

**ముంబై,జూన్ 23 (ఆంధ్ర ప్రగతి**

మహారాష్ట్రలో బలంగా నిలిచిన శివసేన కథ ఇంక కంచికేనా అన్న చర్చ సాగుతోంది. బాణంలా దూసుకుని వచ్చిన బాల్ ఠాక్రే స్థాపించిన 'శివసేన' సరిగ్గా 60 వసంతాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం అవుతున్న వేళ..అంతర్థానానికి దగ్గరవుతోంది. యాదృచ్ఛికమే అయినా 60 వసంతాల పార్టీ ఇలా కావడం స్వయంకృతమే. 1966 జూన్ 19న ముంబైలోని చారిత్రాత్మక శివాజీ పార్క్‌లో బాల్ ఠాక్రే కొబ్బరికాయ కొట్టి ఈ పార్టీని ప్రారంభించారు. నాడు కొద్దిమంది మద్దతుదారులు, వేలాది మంది 'మరాఠీ మానుస్' సాక్షిగా పురుడుపోసుకున్న ఈ ప్రాంతీయ మహావృక్షం.. రెక్కలు విరిగాయి. నేలకొరగడానికి సిద్ధంగా ఉంది. విచిత్రమేమిటంటే.. బాల్ ఠాక్రే స్థాపించిన అసలైన 'శివసేన' పేరు, దాని సాంప్రదాయక 'విల్లు-బాణం' గుర్తు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే వశమయ్యాయి. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే వద్ద తండ్రి పెట్టిన పార్టీ పేరు కానీ, గుర్తు కానీ మిగల్లేదు. వారి పార్టీ ఇప్పుడు 'శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే)'గా రూపాంతరం చెంది, 'మశాల్' (దివిటీ) గుర్తుతో మనుగడ సాగిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ దివిటీ సైతం దాదాపు ఆరిపోయే స్థితికి చేరుకుంది. శివసేనను స్థాపించినప్పుడు బాల్ ఠాక్రే రెండు ప్రధాన ఆశయాలను నిర్దేశించుకున్నారు. ఒకటి 'మరాఠీ అస్తిత్వం', రెండోది 'హిందుత్వ సిద్ధాంతం'. కానీ నేడు ఉద్ధవ్ ఠాక్రే తన తండ్రి నుంచి వచ్చిన ఈ రెండు రాజకీయ వారసత్వాలను కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సి వస్తోంది. బాల్ ఠాక్రే హయాంలో శివసేన సాధించిన శిఖరాగ్రాల నుంచి ఉద్ధవ్ హయాంలో ఎదుర్కొంటున్న జీవన్మరణ పరిస్థితి వరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. 1992 జూలై 18న శివసేనలో జరిగిన ఘటన సంచలనంగా మారింది. బాల్ ఠాక్రే పార్టీని ఒక సొంత ఆస్తిలా చూస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కలత చెందిన బాల్ ఠాక్రే, పార్టీ ముఖపత్రం 'సామ్నా'లో ఒక వ్యాసం రాస్తూ.. తాను



శివసేన నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఈ వార్తతో మహారాష్ట్రవ్యాప్తంగా ఉన్న శివసైనికుల్లో తీవ్ర కలకలం రేగింది. ముంబైలోని శివసేన ప్రధాన కార్యాలయం వెలుపల లక్షలాది మంది సైనికులు తరలివచ్చి.. 'బాలాసాహెబ్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని కన్నీటితో వేడుకున్నారు. శివసైనికులకు తనపై ఉన్న ఆ అచంచలమైన ప్రేమాభిమానాలను చూసి బాల్ ఠాక్రే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. బాల్ ఠాక్రే బతికున్నంత కాలం మహారాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు వారి నివాసమైన 'మాతోశ్రీ' మాత్రమే. శివసేన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ముంబై నగర రిమోట్ కంట్రోల్ బాలాసాహెబ్ చేతుల్లోనే ఉండేది. 'మాతోశ్రీ' నుంచి చిన్న సంకేతం వస్తే చాలు.. ముంబై స్థంభించిపోయేది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్వయంగా ముంబై పోలీసులు సైతం శివసేన ప్రముఖుడిని అభ్యర్థించాల్సిన పరిస్థితి ఉండేది. కోవిడ్ లాక్‌డౌన్ కంటే ముందే.. ముంబై లోకల్ రైళ్లకు బ్రేక్ వేయగల ఏకైక శక్తి బాల్ ఠాక్రేకే ఉండేదని ఇప్పటికీ ముంబై ప్రజలు చెప్పుకుంటారు. కానీ, నేడు బాల్ ఠాక్రే శతాబ్ది జయంతి ఉత్సవాల వేళ, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ రెండోసారి ఘోరమైన చీలికను ఎదుర్కొంటోంది. ఆయన కుడిభుజం లాంటి సంజయ్ రౌత్ కేవలం ప్రత్యర్థులపై వీధి రౌడీల తరహాలో విమర్శలు చేయడానికే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ ఠాక్రేకు, ఉద్ధవ్ ఠాక్రేకు రాజకీయ వ్యూహాల్లోనూ, వ్యక్తిత్వంలోనూ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. బాల్ ఠాక్రే తన జీవితంలో ఎన్నడూ అధికార పీఠాన్ని ఆశించలేదు. ఆయన ఎప్పుడూ 'కింగ్' అవ్వాలని అనుకోలేదు, 'కింగ్‌మేకర్' గానే ఉండటానికి ఇష్టపడ్డారు. శివసైనికులు బాలాసాహెబ్ కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడ్డారంటే.. ఆయన దశాబ్దాల పాటు క్షేత్రస్థాయిలో చేసిన పోరాటమే దానికి కారణం. 2003 నుంచి పార్టీలో ఉద్ధవ్ జోక్యం పెరిగిన తర్వాత, శివసేన ఏకంగా నాలుగు సార్లు పెద్ద తిరుగుబాట్లను చవిచూసింది. ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేసిన ప్రతి ఒక్కరి వాదన ఒక్కటే.. ఆయనలో బాల్ ఠాక్రే లక్షణాలు ఏమాత్రం లేవని, అయినా సరే అందరూ తనను బాలాసాహెబ్‌లాగే గౌరవించాలని ఉద్ధవ్ ఆశిస్తారని అసమ్మతి నేతలు ఆరోపిస్తుంటారు. బీజేపీతో కలిసి ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ఉద్ధవ్ ఠాక్రే అనూహ్యంగా ప్లేట్ ఫిరాయించి కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలిపి స్వయంగా ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాకుండా తన సొంత మంత్రివర్గంలో కొడుకు ఆదిత్య ఠాక్రేకు మంత్రి పదవి కట్టబెట్టారు. ఉద్ధవ్ నిర్ణయాలపై ఆయన భార్య రష్మి ఠాక్రే, కుమారుడు ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్‌లతో కూడిన ఒక ప్రత్యేక కోటరీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇది బాలాసాహెబ్ ఇమేజ్ ముందు ఉద్ధవ్‌ను బలహీనంగా మార్చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. బాల్ ఠాక్రే బతికుండగానే జరిగిన మొదటి తిరుగుబాటు ఇది. భుజబల్ ఆ తర్వాత కాంగ్రెస్, ఎన్సీపీల ద్వారా రాజకీయాల్లో కొనసాగారు. విచిత్ర మేమిటంటే, ఆ తర్వాత కాలంలో అదే భుజబల్‌ను ఉద్ధవ్ తన మంత్రివర్గంలో చేర్చుకోవాల్సి వచ్చింది.
ఇప్పుడు ఏక్‌నాథ్ షిండేతో మొత్తం శివసేన రూపం మారిపోయింది. అసపలు శివసేనకు షిండే నాయకుడయ్యారు. ఇటీవల ఆరుగురు ఎంపీలు కూడా వెళ్లిపోవడంతో ఉద్ధవ్ శివసేన మరింత బలహీనపడింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 24 జూన్ 2026

# జలధార - జలహారతి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి.

**పొలాల మధ్య"4 కి.మీ ఆటో ప్రయాణం చేసి పనుల తనిఖీ.**

**.తంగడంచ చెరువులో ఫీడర్ ఛానల్ పనులను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**






**ఆంధ్ర ప్రగతి జూపాడుబంగ్లా/నంద్యాల, జూన్ 23:**
జిల్లాలో జలధార–జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, సాగునీటి వనరుల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామంలో జలధార – జలహారతి పథకం కింద చేపట్టిన ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులు, చెరువుకు నీరు చేరే సరఫరా కాలువలు (సప్లై ఛానల్స్) మరియు మైనర్ ఇరిగేషన్ ట్యాంకు అభివృద్ధి పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రాంతానికి వాహన మార్గం అందుబాటులో లేకపోవడంతో అధికారులు, సిబ్బందితో కలిసి ఆటోలో ప్రయాణించి, పొలాల మధ్యలో ఉన్న రహదారి ద్వారా దాదాపు 4 కిలోమీటర్ల మేర లోపలికి వెళ్లి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెరువుకు నీటిని అందిస్తున్న రెండు ఫీడర్ ఛానళ్ల అనుసంధానం, వాటి ద్వారా నీటి ప్రవాహం జరుగుతున్న తీరు, సాగునీటి అవసరాలకు అవి అందిస్తున్న ఉపయోగంపై అధికారులతో చర్చించారు. ఫీడర్ ఛానల్ నిర్మాణ నాణ్యత, భౌగోళిక పరిస్థితులు, నీటి ప్రవాహానికి అనుకూలంగా చేపడుతున్న చర్యలు, పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద రెండు ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి పనులకు రూ.6.73 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తనిఖీ సందర్భంగా చెరువు పరిధిలో కొంత భాగం ఆక్రమణలకు గురైనట్లు గుర్తించిన కలెక్టర్, వాటిని తొలగిస్తే చెరువు నీటి నిల్వ సామర్థ్యం దాదాపు 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో అదనంగా సుమారు 0.05 ఎంసీఎఫ్టీ నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల అసలు విస్తీర్ణాన్ని పరిరక్షించడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. జలధార – జలహారతి కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయాభివృద్ధికి కీలకంగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా పనులు అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ట్యాంకుల పునరుద్ధరణతో పాటు జిమ్, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధి పనుల కోసం రూ.60 లక్షలు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ, అభివృద్ధి పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.
అనంతరం డ్వామా సిబ్బంది, మైనర్ ఇరిగేషన్ మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి మొత్తం పనులను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మరింత వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డ్వామా పీడీ సూర్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు ప్రోత్సాహం అందించాలి.

**..పరిశ్రమల స్థాపనకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలి.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**








**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 23:**
జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతమిచ్చే దిశగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో సహా చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, సింగిల్ డెస్క్ విధానం అమలు, వివిధ రాయితీల మంజూరు, పరిశ్రమలకు సంబంధించిన సమస్యలు, కొత్త పారిశ్రామిక అవకాశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపన లక్ష్యాల సాధనలో ఉన్న లోపాలను గుర్తించేందుకు సమగ్రంగా పరిశీలన (గ్యాప్ అనాలిసిస్) చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గతంలో నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిగా ఎందుకు సాధ్యం కాలేదో పరిశీలించి, ప్రజల్లో అవగాహన లేకపోవడమా లేదా బ్యాంకులు, ఆర్థిక సంస్థల సహకారం తక్కువగా ఉండటమా అనే కారణాలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పలు ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నప్పటికీ, రుణాల మంజూరులో జాప్యం, సిబిల్ స్కోర్ వంటి అంశాలు అవరోధాలుగా మారుతున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లోన్ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి, సాధ్యమైనంత వరకు అర్హులైన పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు ప్రోత్సాహకరంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. సింగిల్ డెస్క్ విధానం క్రింద జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం మొత్తం 27 దరఖాస్తులు అందగా, వాటిలో 20 దరఖాస్తులకు సంబంధిత శాఖల ద్వారా అనుమతులు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన ఏడు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వాటిపై నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేసి పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ సబ్సిడీ, పన్ను రాయితీలు తదితర పథకాల కింద జిల్లాలోని ఉత్పాదక మరియు సేవారంగాలకు చెందిన 21 యూనిట్లకు రూ.5.88 కోట్లకు పైగా విలువైన రాయితీ ప్రయోజనాల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. జిల్లాలో మరిన్ని పరిశ్రమలు స్థాపించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, నాబార్డు డీడీఎం కార్తీకేయ, ఎల్డీఎం అయ్యప్పరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇల్లు అద్దెకు కావాలంటూ..

# తాళిబొట్టు గొలుసు లాక్కెళ్లిన వ్యక్తి అరెస్ట్..!

**.రెండు రోజుల్లోనే కేసు ఛేదించిన పోలీసులు బంగారు గొలుసు,బైక్ స్వాధీనం.**

**..సీసీ కెమెరాలే కీలకం..గొలుసు దొంగ అరెస్ట్.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 23:**
ఇల్లు అద్దెకు కావాలంటూ నమ్మించి ఓ మహిళ మెడలోని బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కెళ్లిన వ్యక్తిని నంద్యాల పోలీసులు అరెస్టు చేశారు.అతని వద్ద నుంచి బంగారు గొలుసుతో పాటు నేరానికి వినియోగించిన మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదైన రెండు రోజుల్లోనే నిందితుడిని గుర్తించి పట్టుకోవడం గమనార్హం.

**పోలీసుల వివరాల ప్రకారం..**
నంద్యాల పట్టణంలోని బాలకొండ హాలు వీధికి చెందిన ముమ్మడి చరిత ఇంటికి జూన్ 20న ఓ వ్యక్తి వెళ్లి,పై అంతస్తులో ఖాళీగా ఉన్న ఇంటిని చూపించాలని కోరాడు.ఆమె తాళాలు ఇచ్చి ఇంటిని చూసి రావాలని చెప్పగా,కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి తాళాలు అప్పగించాడు.అనంతరం తాగడానికి నీరు కావాలని అడగడంతో బాధితురాలు ఇంట్లోకి వెళ్లి నీళ్లు తీసుకొచ్చింది.
ఈ సమయంలో మహిళను భయభ్రాంతులకు గురిచేసి,ఆమె మెడలోని బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కొని మోటార్ సైకిల్‌పై పరారైనట్లు పోలీసులు తెలిపారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలు,సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు జరిపిన పోలీసులు మంగళవారం సాయంత్రం చెరువుకట్ట ప్రాంతంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో అతడే ఈ ఘటనకు పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు వెల్లడించారు.
అరెస్టైన వ్యక్తి తమ్మిశెట్టి శివకృష్ణ (38) సం"గా గుర్తించారు.అతని వద్ద నుంచి బంగారు తాళిబొట్టు గొలుసుతో పాటు నేరానికి ఉపయోగించిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచినట్లు సమాచారం.

**..ఎస్పీ అభినందనలు..!!**
కేసు నమోదైన రెండు రోజుల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన వన్‌టౌన్ సీఐ జి.సుధాకర్‌రెడ్డి,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ అభినందించారు.

**..అప్రమత్తంగా ఉండాలని సూచన..!!**
గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.ఇళ్లకు,అపార్ట్‌మెంట్లకు నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని కోరారు.

# లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం పై గోడ పత్రికను విడుదల చేసిన జిల్లా జడ్జి.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 23:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా జడ్జి జి. కబర్ధి గారి చేతుల మీదుగా లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం పై ప్రచురించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లల పై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా ఈ పోక్సో యాక్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు.ఈ పోక్సో కేసుల ను త్వరిత గతిన పరిష్కరించేశీదుకు ప్రత్యేక కోర్ట్ కలదని తెలిపారు. పిల్లలకు ఏదయినా సమస్య వస్తే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సదస్సు లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, ఎక్సైజ్ మేజిస్ట్రేట్ అనిల్ కుమార్, లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జొన్నగిరి పర్యటనఏర్పాట్లను పరిశీలించిన అధికారులు.

**-సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్, జిల్లా కలెక్టర్.**





**ఆంధ్ర ప్రగతి తుగ్గలి జూన్ 23:**తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలోని జియో మైసూర్ బంగారు గనుల వద్ద హెలిప్యాడ్, సమావేశ ప్రాంగణం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించిన సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి. 24న జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి మంగళవారం పరిశీలించారు.జొన్నగిరిలో జియో మైసూర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంగారు గనుల ప్రాజెక్టులో నూతన ప్లాంట్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ చేసి ప్రారంభించనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్, కలెక్టర్ పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమ వేదిక, రహదారులు, పారిశుద్ధ్యం, ఆహారం, తాగునీరు, విద్యుత్ సరఫరా, అంతర్జాలం, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత, వైద్య సదుపాయాల ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్, కలెక్టర్ సూచించారు.పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, శాఖల వారీగా కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల పర్యవేక్షణ లోపరహితంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలన సందర్భంగా కలెక్టర్ జియో మైసూర్ సంస్థ సిబ్బంది శిక్షణార్థం ఏర్పాటు చేసిన 3డి సిములేటర్‌ను సందర్శించారు. అత్యాధునిక సిములేటర్ యంత్రం ద్వారా సిబ్బందికి డ్రైవింగ్ మెళకువలు మరింత సమర్థవంతంగా నేర్పడానికి వీలవుతుందని సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఇ. శ్యాం కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

**.మాధవరం సమీపంలో హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 23:**
ముఖ్యమంత్రి పర్యటనకు సంబధించిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం మండలం మాధవరం గ్రామం సమీపంలో హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి గురువారం మంత్రాలయం లో పర్యటించే అవకాశం ఉన్నందున సంబంధించిన అన్ని ఏర్పాట్లు సమన్వయంతో, ఎటువంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. అలాగే హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం కలెక్టర్ హెలిప్యాడ్ ప్రాంతం, సభా వేదిక స్థలం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) మధుసూదన్ రెడ్డి, ఆర్. అండ్.బి ఎస్. ఈ మహేశ్వర రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, తహశీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టం కొనసాగించాలి.

**-కొత్త విధానాన్ని రద్దు చేయాలని వినతి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 23:**




కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న కొత్త ఉపాధి విధానాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం పీడీ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ, కొత్త విధానం అమలైతే ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర నిధులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఉపాధి హామీ పథకం పేదల చట్టబద్ధ హక్కు అని, రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానంపై పునరాలోచన చేసి రైతులు, కూలీల ప్రయోజనాలను కాపాడాలని కోరారు.కార్యక్రమంలో సంఘం జిల్లా సమితి సభ్యులు ఆర్. సామేలు, పి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# తెలుగు గంగా ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో ప్రోటోకాల్‌పై వివాదం.

**..ప్రాజెక్టు చైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డికి అందని ప్రోటోకాల్ ఆహ్వానం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 23:**
తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించిన ఏ ప్రభుత్వ కార్యక్రమమైన ప్రాజెక్ట్ చైర్మన్ సి సంజీవ్ కుమార్ రెడ్డికి ఆహ్వానించాలి అయితే ఇక్కడ ప్రాజెక్టు సిబ్బంది నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ప్రాజెక్టు చైర్మన్ కే ఆహ్వానించలేదు.వెలుగోడు తెలుగు గంగా క్వార్టర్స్‌లో రూ.3.69 కోట్ల వ్యయంతో నూతన ప్రభుత్వ అతిథి గృహ నిర్మాణానికి జూన్ 17, 2026న నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయని తెలిపారు.అయితే, తెలుగు గంగా ప్రాజెక్టుకు సంబంధించిన ఈ కార్యక్రమానికి తెలుగు గంగా ప్రాజెక్టు చైర్మన్ శ్రీ సి. సంజీవ కుమార్ రెడ్డికి ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రోటోకాల్ నిబంధనలను పాటించడం అధికారుల బాధ్యత అని, సంబంధిత శాఖకు చెందిన చైర్మన్‌ను ఆహ్వానించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న ప్రతినిధులకు తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించడం అవసరమని అభిప్రాయపడ్డారు.భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన కార్యక్రమాల్లో సమన్వయం, పరస్పర గౌరవం, ప్రోటోకాల్ పాటించడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాల గౌరవం మరింత పెరుగుతుందని వారు పేర్కొన్నారు.

# జొన్నగిరి లో ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత.

**..కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్.**

**1200 మంది పోలీసులతో బందోబస్తు...-పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి.**



**ఆంధ్ర ప్రగతి జొన్నగిరి/ తుగ్గలి జూన్ 23:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24వ తేదీన పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో ఉన్న జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం తదితర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారి పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు విధుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడిరాయి గ్రామంలో గోల్డ్ మైన్స్ సమీపంలో జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు దిశానిర్దేశం చేశారు. 1,200 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో నియమించారు. వీరిలో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 14 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 76 మంది ఎస్సైలు, 300 మంది ఏఆర్, ఏపీఎస్పీ మరియు స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు.విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. భద్రతా చర్యలను సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీ హుస్సేన్ పీరా, కడప అడిషనల్ ఎస్పీ శ్రీ ప్రకాష్ బాబు గారు, నంద్యాల అడిషనల్ ఎస్పీ శ్రీ చిన్ని కృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలి.

**..సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 23:**
చట్ట వ్యతిరేక ఔషధాల నియంత్రణ దినోత్సవ ముఖ్య ఉద్దేశం చట్ట వ్యతిరేక(మత్తు పదార్ధాలు, మాదక ద్రవ్యాలు) ఔషధాలను , ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడం ద్వారా ఆరోగ్యంతో పాటు దేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థను, ప్రజల ప్రాణాలను కాపాడాలన్నదే ముఖ్య ఉద్దేశం. చట్ట వ్యతిరేక ఔషధాల వినియోగ కార్యకలాపాలకు పాల్పడడం ద్వారా సమాజంలో అనేక అకృత్యాలకు పాల్పడడం వల్ల ఎందరో అమాయకులు బలికావడం జరుగుతుంది. కావున ప్రస్తుత జీవణ సరళి లో సామాజికంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల పై అవగాహణ కలిగించాల్సిన భాద్యత సామాజికంగా ప్రతి ఒక్కరి పై ఉన్నదని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ తీసుకునే వారు తీవ్ర స్థాయిలో విస్తరించడం వల్ల


పి.మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

డ్రగ్స్ , మత్తు పదార్ధాలు తీసుకోవడం వల్ల ఎందరో అమాయకులు బలి అవుతున్నారు. చాలా కుటుంబాలు నాశనమవుతున్నాయి ఎన్నో రోడ్డు ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నాయని మనం రోజు మీడియా లో చూస్తున్నాము. ఇవన్ని ఆవేదన కలిగించే అంశాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. యుక్తవయస్సులో పిల్లలు పెడదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉంటుంది. విద్యాలయాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిచేలా ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు చేయాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు అంటే ఏమిటి? వాటి వల్ల జరిగే అనర్థాలు ఏమిటి? అనే విషయాలపై ప్రత్యేక చర్చలు జరగాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.మాదకద్రవ్యాలు అనగా మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే కొన్ని పదార్థాలు. వీటిని ప్రపంచమంతా డ్రగ్స్ అని వ్యవహరిస్తారు. మాదకద్రవ్యాల వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనము ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనది.ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాల కన్నా తీవ్రమైన ప్రభావం చూపుతుంది. మాదక ద్రవ్యాలు వల్ల యువత వాటిని వినియోగిస్తూ చెడిపోయి దేశానికి నష్టం వాటిల్లుతుంది.వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులౌతున్నారు. ఒకసారి దీనికి బానిసలై జీవితాలు నాశనమైతాయని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. ఇలాంటి వ్యసనపరుల్ని మళ్ళీ మామూలు మనుషుల్ని చేయడం చాలా కష్టమైన పని. వీరిని డ్రగ్ అడిక్షన్ కేంద్రాలు, మానసిక వైద్యుల ద్వారా చికిత్స చేసి కాపాడవచ్చును. కావున డ్రగ్స్ రహీత సమాజం కొరకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని,ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మ ద్ రఫి కోరారు.

# పాఠశాలల ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలి.

**పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించాలి.**

**.జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి జూపాడుబంగ్లా/నంద్యాల, జూన్ 23:**
జిల్లాలో చేపడుతున్న హరితాభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, విద్యాసంస్థల ఆవరణలను పచ్చదనంతో నింపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం జూపాడుబంగ్లా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల ప్రాంగణాల్లో చేపట్టిన అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి, మొక్కల పెంపకం, సంరక్షణ, నీటి వసతి, వాటి పెరుగుదల స్థితి తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.
అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాసంస్థలో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కింద జరుగుతున్న ఉద్యానవన అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాటిన మొక్కల నిర్వహణ, ప్రాంగణ సుందరీకరణ, పచ్చదనం విస్తరణకు చేపడుతున్న చర్యలను పరిశీలించి, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల ఆవరణల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ విధానంలో తక్కువ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో మొక్కలను పెంచే అవకాశం ఉండటంతో పచ్చదనం వేగంగా విస్తరిస్తుందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్క జీవించి ఎదిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మొక్కల సంరక్షణ బాధ్యతను పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వామ్యంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ భాగస్వాములు కావాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని దాని సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో పర్యావరణహిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణపై బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం గురుకుల విద్యాసంస్థలోని డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ మరియు సిబ్బందికి సూచించారు.

# వక్ఫ్ ఆస్తులను రక్షించడంలో మంత్రి ఫరూక్ విఫలం

**..వైసీపీ మైనారిటీ నేతల ధ్వజం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 23:**
నంద్యాల జిల్లాలో వక్ఫ్ బోర్డు స్థలాలను ప్రభుత్వ సంస్థలకు కేటాయింపు వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ముస్లిం మైనారిటీల పవిత్ర వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ సంస్థలకు కేటాయించడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వ చర్యలను దారుణంగా అభివర్ణించింది. అల్లా పేరిట ఉన్న స్థలాలను కోర్టు కాంప్లెక్స్, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ మైనారిటీ నేతలు నిప్పులు చెరిగారు. నంద్యాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వక్ఫ్ బోర్డు స్థలాలను ఇతర ప్రభుత్వ సంస్థలకు బదలాయించడంపై వైసీపీ మైనారిటీ విభాగం తిరుగుబాటు జెండా ఎగరేసింది. నంద్యాల స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా అధ్యక్షతన ముస్లిం మైనార్టీ నేతల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నీ సా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, మైనార్టీ నాయకులు జి మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సలముల్లా, గన్నీ కరీం,.ఎం గౌస్, నంద్యాల జిల్లా వైసీపీ జనరల్ సెక్రెటరీ దేవనగర్ బాషా తదితరులు అత్యవసర సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇషాక్ బాషా వైసీపీ నేతలు మాట్లాడుతూ... కౌలూరు గ్రామం ఈద్గా కు చెందిన వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్న పది ఎకరాల స్థలాన్ని కోర్టు కాంప్లెక్స్ ల నిర్మాణానికి కేటాయించడాన్ని వైసీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ఎన్.ఎమ్.డి. ఫరూక్.. వక్ఫ్ ఆస్తులను రక్షించాల్సింది పోయి, ఇలా కోర్టుల నిర్మాణానికి రాసివ్వడం ముస్లిం సమాజానికి ద్రోహం చేయడమేనని మండిపడ్డారు."ఒక్కసారి అల్లాకు ఇచ్చిన స్థలాలను కేవలం ముస్లింల ప్రయోజనాల కోసం, దైవకార్యాల కోసమే ఉపయోగించాలి. వాటిని అమ్మడం, బదలాయించడం నిషిద్ధం. వక్ఫ్ ఆస్తులను కాపాడలేని మంత్రి ఫరూక్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో మేము నూనెపల్లి జామియా మసీదు ఆస్తులను కాపాడాం. కానీ ఈ కూటమి ప్రభుత్వం చాబోలు గ్రామం వద్ద ఉన్న వక్ఫ్ బోర్డుకు చెందిన 19 ఎకరాల 14 సెంట్ల భూమిని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు, ఆర్మ్ ఫోర్సెస్ కు కేటాయించడం దారుణమని వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం నంద్యాల జిల్లాలోని ముస్లిం మైనార్టీలంతా సంఘటితం కావాలని, ఈ అన్యాయంపై ఎంతవరకైనా వెళ్లి పోరాడతామని వైసీపీ నేతలు హెచ్చరించారు. చట్టపరంగా, సామాజికంగా కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని వారు స్పష్టం చేశారు.

# వ ర్షాలు సకాలంలో కురవాలని గంగమ్మ తల్లికి పూజలు..!

**..అన్నదాత సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది.**

**...రైతు బాగుండాలి...**

**రైతులకు మంచి పంటలు రావాలి.**

**...ఎరువులు,పురుగు మందుల యజమానులు ప్రత్యేక పూజలు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 23:**
దేశ వ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురవాలని ఎరువులు,పురుగు మందుల దుకాణం యజమానులు గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించడం అభినందనీయమని మార్క్ ఫెడ్ మేనేజర్ హరి నాదరెడ్డి ,వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. నంద్యాల పట్టణంలోని ఎరువుల,పురుగు మందుల యజమానులు వర్షాలు సకాలంలో కురవాలని గంగమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు.భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ముక్కు చెల్లించి,ఘనంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ,మార్క్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎలీనా ప్రభావంతో వర్షాలు అనుకున్నంత ముందు వర్షాలు కురవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.నంద్యాల, కర్నూలు,అనంతపురం జిల్లాల్లో ఎండలు 46 నుంచి 47 డిగ్రీల వరకు నమోదైందన్నారు.జూన్ నెలలో సాధారణ వర్షపాతం కంటే కొద్దిగా ఎక్కువగా ఉన్నా ఆశించిన వర్షాలు పడలేదన్నారు.కర్ణాటక రాష్ట్రంలో సైతం తగినంత వర్షాలు పడటం లేదని అన్నారు.కర్ణాటకలో వర్షాలు బాగా పడితేనే శ్రీశైలం రిజర్వాయర్ కు నీళ్లు వస్తాయన్నారు.ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్లో డెడ్ స్టోరేజ్ కంటే తక్కువ నీళ్లు ఉన్నాయని,215 టీఎంసీ ల నీళ్లు ఉండాల్సింది 41 టీఎంసీ నీళ్ళు ఉన్నాయన్నారు.వర్షాలు బాగా పడితే శ్రీశైలం రిజర్వాయర్ నుంచి వెలుగోడు,గోరుకల్లు రిజర్వాయర్లు నిండుతాయన్నారు.వర్షాలు దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది వరి,మొక్క జొన్న పంటల కంటే తక్కువ నీటితో పండించే కంది,పెసర,మినుము పంటలతో పాటు చిరు ధాన్యాలు పండించాలన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సైతం వర్షాలు తక్కువ పడితే నీళ్లు తక్కువ తో పండే పంటలు పండించే విధంగా




వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశాలు ఇస్తున్నారన్నారు.రైతులు అవగాహనతో వారిలో మార్పు వస్తుందన్నారు.పంటలకు తగినంత రసాయన ఎరువులు వాడాలని విజ్ఞప్తి చేశారు.గంగమ్మ తల్లి కరుణించి మార్చి వర్షాలు పడి ,మంచి వర్షపాత నమోదు కావాలని,రైతులు బాగుండాలి,రైతులకు మంచిపంటలు రావాలని కోరుకున్నారు.ఎరువులు,పురుగు మందుల యజమానులు మాట్లాడుతూ.. రైతులు అందరూ బాగుండాలి అని గత పదేళ్లుగా గంగమ్మ జాతర నిర్వహిస్తున్నామని అన్నారు.దేశానికి రైతే వెన్నెముక,భారతదేశంలో దాదాపు 70 శాతం మంది వ్యవసాయం పైనే ఆధారపడి ఉన్నారని,అన్నదాత సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు జయ ప్రకాష్ రెడ్డి,ప్రసాద రావు,అయూబ్ భాష తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పారదర్శకంగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ.

**..58.67 శాతం ఎస్ఐఆర్ లో జిల్లా పురోగతి.**

**..జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 23:**
జిల్లాలో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్, బీజేపీ పార్టీ ప్రతినిధి చంద్రశేఖర్, సిపిఐ పార్టీ ప్రతినిధి నరసింహులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రియాజ్ బాషా, టిడిపి పార్టీ ప్రతినిధి శివరాం రెడ్డి, వైఎస్సార్సీపీ పార్టీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) భాగంగా జిల్లాలో ఉన్న ఎఈఆర్ఓల నుండి బిఎల్ఓ స్థాయి వరకూ పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకూ 58.67 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి డిజిటలైజ్ కూడా చేయడం జరుగుతోందని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ వివరించారు. అదే విధంగా బిఎల్ఓల క్షేత్ర పర్యటనలో భాగంగా మ్యాపింగ్ కానీ ఓటర్లు ఎన్నికల కమీషన్ నిర్దేశించిన ధృవ పత్రాల అందజేతపై బిఎల్ఓల ద్వారా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నింపాల్సిన ఎన్యూమరేషన్ ఫారాన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు పూర్తి స్థాయిలో వివరించారు. అదే విధంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ తెలిపారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# పచ్చదనమే నంద్యాల పట్టణ ప్రగతికి బాట.!

## ..పద్మావతి నగర్ డివైడర్‌లో మొక్క నాటిన మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 23:**
పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తూ నంద్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పచ్చదనం అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని పద్మావతి నగర్ ప్రధాన రహదారి మధ్యనున్న డివైడర్‌లో ఆయన స్వయంగా మొక్కను నాటి పచ్చదనం పెంపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రహదారుల డివైడర్లు, ఖాళీ స్థలాలు, కాలనీలు, పార్కులు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నాటిన మొక్కలు కేవలం సంఖ్యకే పరిమితం కాకుండా వాటి ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు



సూచించారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. డివైడర్లపై పచ్చదనం పెరగడం వల్ల రహదారులకు అందం చేకూరడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మొక్కల నాటిన అనంతరం కమిషనర్ అక్కడి నిర్వహణ పనులను పరిశీలించి, మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ చర్యలు చేపట్టడం, పరిశుభ్రతను కాపాడడం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ గురప్ప యాదవ్, డీఈలు నాగభూషణ్ రెడ్డి, పవన్ కుమార్, రసూల్, ఏఈ హిమబిందు, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్. శభరిష్. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు అందించిన లయన్స్ క్లబ్.

..ఐక్యరాజ్యసమితి ప్రజా సేవా దినోత్సవం పురస్కరించుకుని.

..నంద్యాల రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు రెండు అందజేసిన నంద్యాల లయన్స్ క్లబ్.

..చక్రాల కుర్చీల దాతలు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్.




రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు అందజేస్తున్న నంద్యాల లయన్స్ క్లబ్ ప్రతినిధులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 23:** ఐక్యరాజ్యసమితి ప్రజాసేవ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ కు ప్రయాణికుల సౌకర్యార్థం చక్రాల కుర్చీలు రెండు అందజేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, దాతలు నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు భవనాసి నాగ మహేష్ లు చక్రాల కుర్చీలు రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ కు అందజేశారు.
ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ నిరంతర సేవా కార్యక్రమాలను గత 56 సంవత్సరాలుగా చేస్తున్నదని భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు. రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధులకు ఈ చక్రాల కుర్చీలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ చంద్రశేఖర్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మరియు రైల్వే క్రూ కంట్రోలర్ రవి ప్రకాష్, లోకో పైలట్ రామన్న, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఎంపీవి రమణయ్య, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యూసుఫ్, నూతన కార్యదర్శిగా ఎంపికైన మేడా చంద్రశేఖర్, పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవి పాల్గొన్నారు.

# గురురాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా ఒలంపిక్ డే వేడుకలు.

## ..వేడుకలను ప్రారంభించిన పాఠశాల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి.










**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 23:**
నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలో ఉన్న గురురాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా ఒలంపిక్ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాఠశాల అధినేత డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ముందుగా రాష్ట్ర జాతీయ స్థాయిలో పీట పథకాలు సాధించిన క్రీడాకారులతో ఒలంపిక్ టార్చ్ ను ప్రదర్శించారు. పాఠశాలలు నిర్వహించిన ఒలంపిక్ టార్చ్ ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడా దినోత్సవం వేడుకలు పాఠశాలలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉత్సాహాన్ని నింపేందుకు వేడుకలు ఎంతో దోహదపడ్డాయని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి క్రీడా పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తూ అందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నామని గుర్తు చేశారు. ఒలంపిక్ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉషా కళ్యాణ్ పాల్గొన్నారు.






# మహానంది మండలంలో.. విద్యుత్ శాఖకు రూ.10 లక్షల నష్టం.





**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 23:** మహానంది మండలంలోని గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి విద్యుత్ శాఖకు భారీగా నష్టం వాటిల్లింది. మండలంలోని ఆర్ఎస్ గాజుల పల్లె, శ్రీనగరం, నంది పల్లె, బొల్లవరం గ్రామాల్లో వృక్షాలు, చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో 29 స్తంభాలు విరిగిపోగా, మూడు ట్రాన్స్ఫార్మర్లు దెబ్బ తిన్నాయని ఏఈ ప్రభాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు రూ. 10 లక్షల మేర నష్టం వాటిలిందన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామన్నారు.

# నాడు డాక్టర్ సుధాకర్.. నేడు సాయికృష్ణ..

## అధికారం మార్చే రాజకీయ రంగులు..!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 23:**
రాజకీయాల్లో 'అధికారం' అనేది ఒక విచిత్రమైన అద్దం. ఆ అద్దంలో చూసుకున్నప్పుడు కనిపించే రూపం.. అధికారం పోయాక పూర్తిగా మారిపోతుంది. నాడు అధికార పీఠంపై కూర్చున్నప్పుడు ఒక పౌరుడి ఆర్తనాదం 'ప్రభుత్వ వ్యతిరేక కుట్ర'గా కనిపిస్తుంది. అదే అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో కూర్చున్నప్పుడు, ప్రతి చిన్న ఘటనా 'ప్రజాస్వామ్య ఖూనీ'గా కనిపిస్తుంది.
ఈ ద్వంద్వ నీతికి, అవకాశవాద రాజకీయాలకు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయి.. 2020 నాటి దళిత డాక్టర్ సుధాకర్ ఉదంతం, మరియు నేటి విజయవాడ గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసు.





### 1.నాడు డాక్టర్ సుధాకర్ : ప్రశ్నిస్తే 'పిచ్చి' ముద్ర!

కోవిడ్ తొలి విడత వేళ.. ప్రపంచమంతా ప్రాణభయంతో వణికిపోతున్న రోజులు. ఆసుపత్రుల్లో రోగులకు చికిత్స అందించే వైద్యులకు కనీస రక్షణ పరికరాలైన ఎన్-95 మాస్కులు, పీపీఈ కిట్లు లేవు. ఈ ప్రాథమిక లోపాన్ని ఎత్తిచూపినందుకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి అనస్థీషియా నిపుణుడు డాక్టర్ కె. సుధాకర్ రావును నాటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం శత్రువులా చూసింది.
వ్యవస్థల అణిచివేత: మాస్కులు అడిగినందుకు ఆయన్ను సస్పెండ్ చేయడమే కాకుండా, విశాఖపట్నం రోడ్డుపై అర్ధనగ్నంగా ఈడ్చుకెళ్లి, చేతులు కట్టేసి కొట్టించారు.
సామాజిక హత్య: అంతటితో ఆగకుండా, పోలీసుల తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఆయనకు 'పిచ్చి' ఉందంటూ ముద్ర వేసి, బలవంతంగా మానసిక ఆసుపత్రిలో నిర్బంధించారు. ఒక ప్రతిభావంతుడైన దళిత వైద్యుడి ఆత్మగౌరవాన్ని క్రమంగా చంపుతూ వచ్చి, చివరకు ఏడాది తిరిగేసరికి ఆయన గుండె ఆగిపోయేలా చేశారు. నాటి పాలకులు ఈ క్రూరత్వాన్ని సమర్థించుకున్నారే తప్ప, ఒక్కరంటే ఒక్కరు కూడా డాక్టర్ సుధాకర్ కుటుంబానికి బాసటగా నిలవలేదు.

### 2.నేడు గాదె సాయికృష్ణ: లాకప్ డెత్‌పై వైసిపి గర్జన!

కాలం చక్రం తిరిగింది. నాడు అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేడు ప్రతిపక్షంలోకి వచ్చింది. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో గాదె సాయికృష్ణ అనే యువకుడు అక్రమ పోలీస్ నిర్బంధంలో మరణించాడనే ఆరోపణలు రావడం, సీఐ నాగరాజుపై హత్య కేసు నమోదు కావడం సంచలనంగా మారాయి.
న్యాయం కోసం పోరాటం: ఈ ఉదంతంపై వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. బాధితులకు న్యాయం జరగాలని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక బాధ్యత గల ప్రతిపక్షంగా బాధితుల తరఫున నిలబడటం శ్లాఘనీయమే. కానీ, ఇక్కడే సామాన్యుడికి ఒక ప్రశ్న తలెత్తుతోంది..
నాడు లేని మానవతావాదం నేడు ఎలా వచ్చింది?: సాయికృష్ణ అనే రౌడీషీటర్ హక్కుల కోసం ఈరోజు ఆవేదన చెందుతున్న గొంతుకలు.. నాడు దేశం మెచ్చిన డాక్టర్ సుధాకర్ ప్రాణాలు కోల్పోతున్నప్పుడు ఎందుకు మూగబోయాయి? నాడు పోలీసుల అరాచకత్వాన్ని సమర్థించిన నోళ్లే.. నేడు అదే పోలీస్ వ్యవస్థపై ఎందుకు విరుచుకుపడుతున్నాయి.?

### 3.అధికార గర్వం వర్సెస్ ప్రతిపక్ష ఆక్రందన.

ఈ దేశంలో ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను తమ సొంత సైన్యంగా వాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. పోలీసులకు అపరిమితమైన అధికారాలు ఇచ్చి, ప్రశ్నించే గొంతులను నొక్కేయడానికి ప్రయత్నిస్తుంది. దానికి డాక్టర్ సుధాకర్ కేసే ఒక ఉదాహరణ.
కానీ అదే పార్టీ ప్రతిపక్షంలోకి రాగానే, పోలీసులు చేసే తప్పులను ఎండగడుతూ 'చట్టం-న్యాయం' అంటూ ఉపన్యాసాలు ఇస్తుంది.
అధికారంలో ఉన్నప్పుడు: "వ్యవస్థ అంతా మా చేతుల్లో ఉంది.. మేం ఏం చేసినా చెల్లుతుంది" అనే అహంకారం.
ప్రతిపక్షంలో ఉన్నప్పుడు: "ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది.. మానవ హక్కులు కాలరాస్తున్నారు" అనే ఆవేదన. ఈ రెండు నాలుకల ధోరణే నేటి సమాజానికి పట్టిన అసలైన చీడపురుగు!

### 4.ముగింపు: మార్పు ఎప్పుడు?

గాదె సాయికృష్ణది లాకప్ డెత్ అయితే దానికి కారణమైన పోలీసులకు కఠిన శిక్ష పడాల్సిందే. అందులో ఎలాంటి సందేహం లేదు. చట్టం తన పని తాను చేసుకుపోవాలి. కానీ, రాజకీయ నేతలు తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను మర్చిపోయి, ప్రతిపక్షంలోకి రాగానే నీతులు చెప్తే ప్రజలు నమ్మే రోజులు పోయాయి. పాలకులు మారవచ్చు, ప్రభుత్వాలు మారవచ్చు. కానీ చట్టం, మానవ హక్కులు అందరికీ ఒకేలా వర్తించాలి. ప్రశ్నించిన డాక్టర్‌కైనా, రౌడీషీట్ ఉన్న సాయికృష్ణకైనా చట్టం పరిధిలోనే విచారణ జరగాలి తప్ప.. పోలీస్ స్టేషన్లు ప్రాణాలు తీసే వధశాలలుగా మారకూడదు. అధికారంలో ఉన్నప్పుడు కళ్లు మూసుకుని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రమే కన్నీళ్లు కార్చే 'అవకాశవాద రాజకీయాన్ని' ప్రజలు గమనిస్తూనే ఉంటారు. అధికారం ఉన్నప్పుడే మానవత్వం చూపించని నాయకుడికి.. ప్రతిపక్షంలో ఉండి పోరాడే నైతిక అర్హత ఎలా ఉంటుందో ఆ దేవుడికే తెలియాలి.!